
# దెయ్యప హతుడు

హారర్ స్టోరీ

- వసుంధర



అర్థరాత్రి. వీధరుగుమీద మడత మంచం మీద పడుకున్న నాకు ఏదో అలికిడికి మెలకువొస్తే చటుక్కున కళ్లు తెరిచాను. ఇంటికెదురుగా మట్టి దిబ్బమీద వేపచెట్టొకటి పూనకం వచ్చిన మనిషిలా ఊగిపోతోంది. ఉన్నట్టుండి ఆ చెట్టుమీంచీ ఓ ఆకారం కిందకురికింది. తెల్ల చీర. విరబోసుకున్న జుట్టు పిరుదుల్ని తాకుతోంది.
ఎవరో ఆడ మనిషి. అంత రాత్రి పూట చెట్టెందుకెక్కిందో, ఇలా ఎందుకు దూకిందో అని ఆలోచిస్తూండగా రాత్రి ఇంట్లో జరిగిన రభస గుర్తుకొచ్చింది.

చిన్నప్పుడెప్పుడైనా పల్లెలకి వెళ్లి ఉండొచ్చునేమో కానీ – నాది ఇంచుమించు పట్నవాసమేనని చెప్పాలి. శ్యామ్ పెళ్లికని నోయిడా నుంచి వచ్చాను. ఉద్యోగరీత్యా వాడిప్పుడు సూరత్‌లో ఉంటున్నా మా ఇద్దరికీ కాలేజి రోజుల్నించీ ప్రాణస్నేహం.

కృత్రిమ వాతావరణంలో కలుషితమైన గాలికీ, నీరుకీ అలవాటుపడ్డ నాకు రాజమండ్రికి దగ్గర్లో ఉన్న శ్యామ్ పల్లె చేరగానే ప్రాణం లేచొచ్చింది. పల్లెగాలి నిమురుతుంటే హాయిగా నిద్రపోవాలని రాత్రికి పెరట్లో ఆరుబయట పక్క వేయమంటే మంచు కురుస్తుందని వద్దన్నారు. కనీసం వీధరుగుమీద పడుకుందామన్నాను. అంతా నాకేసి ఏదోలా చూసారు.

''అమ్మో-వీధిలో దెయ్యాలు తిరుగుతాయి'' అన్నాడు శ్యామ్ మేనల్లుడు పదేళ్లవాడు.

నేను దెయ్యాల్ని నమ్మను. హైస్కూల్లో ఉండగానే మిత్రులతో సవాలుచేసి ఒక రాత్రంతా శ్మశానంలో గడిపి వచ్చినవాణ్ణి. కాలేజి రోజుల్లో సెకండ్ షోకి హారర్ సినిమా చూసి నిర్మానుష్యమైన దారిలో ఒక్కణ్ణీ నడుచుకుంటూ హాస్టలు చేరుకున్నవాణ్ణి.

ఆ విషయం గుర్తుచేస్తే ''పట్నం మనుషుల గాలి పడక దెయ్యాలన్నీ పల్లెపట్టున చేరాయిలే. ఇక్కడ వాటిని నమ్మకపోతే సాగదు'' అంటూ వాడు నాకు సాయంగా కూడా పడుకోనన్నాడు. మరొకప్పుడు ఐతే – ఏమోకానీ రేపట్నుంచీ వాడి

పెళ్లితంతు మొదలు మరి.

ఐనా నేను మొండికేస్తే విసిగిపోయి వాడూ సరేనన్నాడు. వాడి తల్లి మాత్రం నొచ్చుకుని, ''ఆ అబ్బాయికైతే తెలియదు. తెలిసిన నువ్వు నచ్చజెప్పాలి కానీ సరేనంటావేంటి?'' అని మందలించింది.

అప్పుడు చెప్పాడు శ్యామ్. వీధరుగుకెదురుగా ఉన్న వేపచెట్టు మీద చాలాకాలంగా ఓ దెయ్యముంటోందిట. మనుషులతో ఆడుకోవడం దానికిష్టంట. ఊరంతా భయపడతారుట దానికి - ఒక్క నాగరాజు తప్ప.

''వాడో వ్యసనపరుడు. పట్నంలో రెడ్‌లైట్ ఏరియాల్లో తిరిగి ఫుల్‌డోసులో ఊరు చేరుకునే సమయానికి డెడ్‌నైట్ ఔతుంది. వాడి బైక్ చప్పుడుకి దెయ్యాలు భయపడాలి కానీ - వాడెందుకు భయపడతాడు? వ్యసనం మత్తు అలాంటిది...'' అనేసాడు శ్యామ్.

''నాకు వ్యసనాల్లేవు. ఐనా దెయ్యాలే నన్నుచూసి భయపడాలి. నేను వాటికి భయపడను'' అన్నాను.

''భయపడే వాళ్లని భయపెడతాయే తప్ప దెయ్యాలు హాని చేయవు. నీకు భయం కూడా లేదన్నావుగా - ఐతే ఒకే'' అన్నాడు శ్యామ్.

అలా నేను అరుగుమీద పడక సాధిస్తే - ఇప్పుడు వేప చెట్టుమీంచి ఓ ఆడమనిషి కిందకి దూకింది. ఆ ఆకారం మనిషా, దెయ్యమా?

నేనింకా ఆలోచిస్తూండగానే - ఆ ఆకారం వెనక్కి తిరిగింది.

సందేహం లేదు - మనిషే - చాలా అందంగా కూడా ఉంది. చీకట్లో ఉన్నాను - ఆమెకి నేను కనబడుతున్నానో లేదో తెలియదు. ఆమె మాత్రం నన్నే చూస్తున్నట్లుంది. నేనూ ఆమెనే చూస్తున్నాను. ఉన్నట్లుండి ఆమె ముఖంలో ముగ్ధమనోహరంగా చిరునవ్వు.


వెండి తెరమీద అందాల హీరోయిన్లా ఉన్న ఆమె - అంతలో చెట్టుమీంచీ బత్తాయిపండు పరిమాణంలో ఓ బంతి రాలుతుంటే - కింద పడకుండా ఎడం చేత్తో పట్టుకుంది - ఎడమ చేతి వాటమేమో మరి. ఆ వెంటనే బంతిని కుడిచేతిలోకి మార్చుకుని - ఎడమ చెయ్యి నా వైపు చాచింది. నాలుగు వేళ్లనీ వంచుతూ తనవైపు రమ్మన్నట్లు సైగ చేసింది.

నేనామెకి కనిపిస్తున్నానని అర్థమైంది. లేద్దామనుకుంటూండగా - దూరంగా బైక్ చప్పుడు.

ఆమె ముఖంలో నవ్వు మాయమైంది. ఉన్నట్లుండి గాల్లోకి లేచి చెట్టు కొమ్మల మధ్య మాయమైంది. నేను నివ్వెరపోయాను. ఏదో తెలియని భయం నన్నావహించింది. శ్యామ్‌ని పిలవాల అనుకుంటూండగా - చెట్టుకొమ్మల మీంచి ఆమె తలకిందులుగా వేలాడింది. చెట్టుమీంచీ ఊగుతూ ఇంతై అంతై నా మీదకీ వచ్చి నోరు తెరిచింది. అప్పుడామె అనకొండలా, ఆ నోరొక కొండగుహలా అనిపించి కెవ్వుమనబోతే గొంతు పెగలలేదు. స్పృహ తప్పింది.

మళ్లీ ఎవరో నన్ను కుదిపి లేపేదాకా నాకు మెలకువ రాలేదు. కళ్లు తెరిస్తే అప్పటికే బారెడు పొద్దెక్కింది. శ్యామ్ నన్ను కుదుపుతూ, ''హాస్టల్ రోజుల్లో నువ్వే నన్నెప్పుడూ నిద్రలేపేవాడివి. ఆ ఋణం తీర్చుకునే అవకాశమివ్వాలనా - ఇంత మొద్దు నిద్ర పోయావ్!'' అన్నాడు.

అర్థరాత్రి అనుభవం గుర్తుకొచ్చి వేపచెట్టుకేసి చూసాను. జరిగినదంతా భ్రమ అనిపించేటంత ప్రశాంతంగా ఉందా చెట్టు. నేను నిజంగా దెయ్యాన్ని చూసానా, లేక ఇంట్లోవాళ్లు చెప్పినవన్నీ విని భ్రమపడ్డానా - అన్న అనుమానం కలిగింది. ఎందుకంటే - వేప చెట్టుమీద దెయ్యం గురించి వాళ్లే చెప్పారు. బైక్‌మీదొచ్చే నాగరాజు గురించీ వాళ్లే చెప్పారు. భయపెడుతుందే తప్ప హాని చేయదన్నారు. ఆ మాటల ప్రభావమే నన్ను భ్రమకి గురి చేసి ఉండొచ్చు.



అప్పటికలా సరిపెట్టుకోవడం వల్ల శ్యామ్‌కి నా అనుభవం చెప్పలేదు. నా ధైర్యం మీద వాడికున్న నమ్మకాన్ని సడలించకూడదన్న అహం కూడా మరో కారణం.

***

ఆ రోజు సాయంత్రమే పెళ్లివారి బస్సు కాకినాడ చేరుకుంది. చిత్రమేమిటంటే - ఇది అసలు సిసలు అరేంజ్డ్ మ్యారేజ్. అంతవరకూ వధూవరుల్నొకరు చూసుకోలేదు. తల్లిదండ్రులకి నచ్చిన పిల్ల తనకీ నచ్చి తీరాలని శ్యామ్ సిద్ధాంతం. ఐతే వధువు స్వప్న విషయంలో వాడికో చిన్నఅనుమానముంది. మన వ్యవస్థలో పురుషుడికున్న స్వేచ్ఛ స్త్రీకి లేదు కాబట్టి - రోజా సినిమాలోలా ఆమె ఇబ్బందిపడ్డం లేదు కదా అని. అది తెలుసుకునే బాధ్యత నాకప్పగించాడు.

రాత్రి ఎనిమిది గంటలకి నేను విడిదినుంచి పెళ్లివారింటికి వెళ్లాను. శ్యామ్ స్నేహితుణ్ణని అక్కడ నాకు ఘనంగా మర్యాదలు జరిగాయి. పెళ్లికూతురితో మాట్లాడ్డానికి నన్నో చిన్న గదిలోకి పంపారు. అదామె స్టడీ రూంట. సింపుల్‌గా అందంగా సర్ది ఉంది. గోడవార ఓ టేబుల్ మీద పుస్తకాలు, టేబుల్ లైటు, ఓ ఫొటో! ఫొటో చూసి ఉలిక్కి పడ్డాను.

ఆ బల్ల ఓ వేపచెట్టులా, ఆ ఫొటో ఆమెలా...

నిన్నరాత్రి వేపచెట్టు మీంచి దూకిన సుందరి ఆ ఫొటోలో ఉంది.

బహుశా ఆమె పెళ్లికూతురి అక్కై ఉంటుంది. చనిపోయి దెయ్యమై శ్యామ్ ఊరొచ్చి....

ఊహలెందుకూ - స్వప్ననే అడిగి తెలుసుకోవాలి అనుకుంటూండగా - అంతలో అడుగుల చప్పుడు. వెనక్కి తిరిగితే - ఊహించని షాక్...

ఫొటోలో అమ్మాయి నడిచి వస్తోంది - చేతిలో పుస్తకం. సన్నగా నవ్వు....

ఆ నవ్వు, ఆ పిలుపు. చెట్టుమీంచి దూకుతూ, తలకిందులుగా వేలాడుతూ...

దెయ్యానికి భయపడననుకునే నేనిప్పుడు మనిషికి భయపడుతున్నాను.

''అదేమిటీ - అలాగైపోయారు?'' అంది స్వప్న.

తమాయించుకుని, ''మీకూ ఆ ఫొటోలో మీ అక్కకీ అంతలా పోలికలు కనబడితే షాక్ తిన్నాను'' అన్నాను.

ఆమె ఆశ్చర్యపోయింది. ఆమెకి అక్కలు లేరు. ఓ తమ్ముడున్నాడు. బల్లమీద ఫొటో ఆమెదే.

గుండె గుభేల్మంది. నిన్నరాత్రి సంఘటన గురించి తనకి చెప్పే సందర్భం కాదిది.

గుండెరాయి చేసుకున్నాను. మనసుకి ధైర్యం చెప్పుకుని తెచ్చిపెట్టుకున్న నవ్వుని పెదాలకి పులిమి ఆమె వంక చూస్తే - ఏం చెబుతావో చెప్పమన్నట్లు చూసింది.

చెట్టుమీంచి వెనక్కి తిరిగినప్పుడూ అదే చూపు. చెట్టుకి తలకిందులుగా వేళ్లాడుతూ అదే చూపు. ఈ స్వప్న మనిషేనా? మనిషైతే - నిన్నరాత్రి నాకు శ్యామ్ ఊళ్లో ఎలా కనిపించింది? మనిషి కాకపోతే - అప్పుడు నాకు అలా ఎందుకు కనిపించింది?

గొంతు సవరించుకుని శ్యామ్ సందేశం వినిపించాను.

నేను చెబుతున్నంతసేపూ తలవంచుకుని విన్నదామె. చెప్పడం పూర్తికాగానే తలెత్తి మందహాసం చేసింది. అచ్చం నిన్న రాత్రి లాగే!

నేను లేచి నిలబడ్డాను. వెనక్కి తిరిగాను. ఏదో చప్పుడైతే మళ్లీ ఆమె వైపు తిరిగాను.

స్వప్నచేతిలో పుస్తకం జారి పడ్డట్లుంది. వంగి ఎడమచేత్తో తీసుకుంటోంది. అంటే ఆమెది ఎడమచేతి వాటం! అంటే నాది భ్రమ కాదు.

నాలో ఇంకా ఏమైనా డౌట్సుంటే తీర్చడాని కన్నట్లు ఉన్నట్లుండి ఆమె నాలిక బయట పెట్టి వెక్కిరించింది. ఆ నాలుక ఎర్రగా ఉంటే ఆశ్చర్యం లేదు. కానీ అది ఆరడుగుల పొడవుంది.

***

స్వప్న మామూలు మనిషికాదని నాకర్థమైపోయినా - శ్యామ్‌తో ఆమె పెళ్లి ఆపే ప్రయత్నమేం చెయ్యలేదు నేను. ఎందుకంటే వాడికామె నచ్చింది. వాడికామెపై ఎలాంటి అనుమానాలూ లేవు. వాడికే కాదు - నాకు తప్ప ఇంకెవరికీ ఆమె మనిషి కాదన్న

భావనేలేదు. పెళ్లిలో కూడా ఎవరికీ ఆమె నుంచి చేదు అనుభవాలెదురైనట్లు లేదు. నేను మాత్రం సాధ్యమై నంతవరకూ ఆమెని తప్పించుకుని తిరిగాను. తప్పని పుడు ఎవరో ఒకరు తోడుండేలా జాగ్రత్త పడ్డాను.

పెళ్లి తంతు పూర్తికాగానే శ్యామ్ దగ్గిర సెలవు తీసుకున్నాను. ''స్వప్న నీతో ఏకాంతంగా మాట్లాడా లిట'' అన్నాడు వాడు నవ్వుతూ.

నాకు నరాల్లోంచీ భయం పుట్టుకొచ్చింది. ఇబ్బంది పడుతున్నట్లు నటించాను కానీ – కట్టుకున్న మొగుడే స్వయంగా చెప్పినప్పుడు నటన వీలుకాదు. అసలు సంగతి వాడికెలా చెప్పేది? మనిషి చెడ్డదో, దుర్మార్గురాలో ఐతే ఏమో కానీ – దెయ్యమైతే చెప్పి ఎలా నమ్మించేది? నా అనుభవం నిజమో, భ్రమో



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### ఫ్లాష్‌గన్

ఫొటోగ్రఫీ ప్రదర్శనలో న్యాయనిర్ణేతలు ఏకగ్రీవంగా మొదటి బహుమతి ఎంపిక చేసిన చిత్రమది.

ఒక చిన్నపిల్ల అగ్గిపుల్లతో కొవ్వొత్తి వెలిగిస్తున్నది. అది క్రిస్మస్ సీజన్ కావడంతో బహుమతులు గుట్టల్లా పడున్నాయి. గదిలో నిండిన వెలుగు ఆ మెరుపు కాగితాల మీద పడి ప్రతిబింబిస్తున్నది. అయితే, అందులో ప్రత్యేకత ఏమిటంటే, కిటికీ అవతల ఒక స్త్రీ శరీరం కనిపిస్తున్నది.

ఇక, ఆ ఫొటో గురించిన వివరణ యిలా వుంది: న్యూయార్కులోని ఒక అపార్టుమెంటు ఆరో అంతస్తులో ఈ ఫొటో తీశారు. కెమెరా క్లిక్కు మన్నప్పుడు, కిటికీ ఆవల, పైఅంతస్తు నుండి ఒక స్త్రీ కిందికి దూకింది. ఆమె శరీరం ఈ చిత్రంలో బందీ అయింది. అప్పుడు గంటకు నలభై మైళ్ళ వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. కిందపడిన స్త్రీ బరువు కేవలం తొంభై పౌన్లు. ఆమె కింద పడు తున్న క్రమంలో కిటికీ కోడును పట్టుకోవటానికి ప్రయత్నించింది. కాని, పాపం, ఎక్కడా పట్టు చిక్క లేదు. చివరికి, పేవ్‌మెంట్ మీద వెల్లకిలా పడింది. ఈ చిత్రం ఆనంద విషాదాల సమ్మేళనం...

''ఈ కాంపొజిషన్ యాదృచ్ఛికమే అయినప్పటికీ అద్భుతం'' అన్నాడో విమర్శకుడు.

''అవును. ఇది రెండు బొమ్మల సమ్మేళనం'' అన్నాడు డిటెక్టివ్.

అందులో, రెండు వేర్వేరు బొమ్మలున్నాయని అతడెలా కనిపెట్టాడు?

సమాధానం: 1. ఫొటో తీసినప్పుడు కిటికీ మూసి వుంది. లేకపోతే, నలభై మైళ్ళ వేగంతో గాలి వీస్తున్నప్పుడు అగ్గిపుల్ల వెలిగించటం అసాధ్యం.

2. ఆ బొమ్మ చీకట్లో తీశారు. గాజు తలుపున్న కిటికీ మూసినప్పుడు బైటి దృశ్యం కనిపించదు (అంటే ఫ్లాష్‌గన్ వెలిగినప్పుడు. గదిలో వెలుగు నిండి, గాజు మీద పడి పరావర్తనం చెందుతుంది).

నేనే తేల్చుకోలేకుండా ఉన్నాను మరి.

స్వప్నని ఏకాంతంలో కలుసుకున్నప్పుడు – దేవకన్యలా ఉన్న ఆమెను చూసి – ఈమెనా నేను దెయ్యం అనుకున్నది – అని బాధపడ్డాను. ఆమె అభిమానంగా నవ్వి, ''శ్యామ్ నా భర్త కావడం నా అదృష్టం. ఆ అదృష్టం చేజారిపోకుండా కాపాడింది మీరు. మీకు నా అంత మంచి అమ్మాయిని భార్యగా చేసి మీ ఋణం తీర్చుకుంటాను'' అంది.

''ఇందులో నేను చేసిందేముంది? ఇది పెద్దలు కుదిర్చినపెళ్లి. మీరు ఋణం తీర్చు కోవాల్సింది నాక్కాదు, వాళ్లకి...'' అన్నాను కంగారుగా. స్వప్నంత మంచమ్మాయంటే నాకు హడల్ మరి!

''పెళ్లి పెద్దలే కుదిర్చినా మీరు శ్యామ్ విశాల హృదయం చెప్పకపోతే – ఏమో – నేనేం చేసే దాన్నో!'' అందామె భారంగా నిట్టూర్చి.

ఆట పట్టిస్తోందా అని అనుమానమొచ్చి మౌనం వహించాను. ఆమె తనే మళ్లీ, ''అది బిఫోర్ క్రైస్టైనా, ఇరవయ్యొకటో శతాబ్దమైనా విశాల హృదయమున్న మగాడి తోడు దొరక్కపోతే మన దేశంలో ఆడదానికి మనుగడ లేదు. రేపు మేము హనీమూన్‌కి వెడుతున్నామా – మేమున్న టాక్సీకి యాక్సిడెంటైతే – కొత్త పెళ్లికూతురు పాదమలాంటిది అంటారు. ఆ తర్వాత నెల్లాళ్లకే మా మామగారు పోతే – ఇప్పటికే రెండు ఎటాక్సు వచ్చాయి కదా అనుకోరు. కోడలిపాదం అంటారు. అప్పుడు అత్తగారు మంచం పడితే – మొగుడిమీద బెంగతో అనుకోరు. అదీ కోడలి తప్పే అంటారు. నన్ను ప్రేమించిన వీరూ వదిన ఇలాంటి ఇబ్బందులే పడుతోంది. వీరూ తన వాళ్లని తప్పు పట్టదు. భర్తమీద ప్రేమతో అలాంటివి సర్దుకుపోతోం దని వదినగార్ని మెచ్చుకుంటాడు. మీరు శ్యామ్ విశాల హృదయం గురించి ముందురోజు చెప్పకపోతే – నేను వీరూ పాలై ఉండేదాన్ని. అటు పుట్టింట్లో శాప నార్థాలు, ఇటు మెట్టినింట్లో సాధింపులు. అన్నీ మీ ఒక్కరి మాటతో తప్పాయి. ఋణం తీర్చుకునేదాకా మిమ్మల్ని వదలను'' అందామె.

నాకది హెచ్చరికలా అనిపించింది. ఐనా థాంక్స్ చెప్పి వెనుదిరిగాను.

అప్పుడే ఏదో కిందపడ్డ చప్పుడైంది. నేను మాత్రం వెనుదిరగలేదు. ఆరడుగుల పొడవున్న ఎర్ర నాలుకని మరోసారి చూసి తట్టుకునే ధైర్యం నాకు లేదు.

***

నోయిడా వెళ్లేక తెలిసింది. హనీమూన్‌లో ఉండగా శ్యామ్ దంపతులెక్కిన టాక్సీకి యాక్సిడెంటైందని. ప్రమాదకరమైన దెబ్బలుతగలకపోయినా హాస్పిటల్లో రెండ్రోజులున్నారట.

ఈ వార్త నన్ను బాగా కలవరపర్చింది.

చూడ్డానికి దేవకన్యలా ఉండొచ్చుకాక – స్వప్న నిస్సందేహంగా ఓ భయంకర మానవాతీత శక్తి. ఆ విషయం తెలియచెప్పడానికి ఎందుకో నన్నెన్నుకుంది. పెళ్లయ్యేక నాతో ఏకాంతంగా మాట్లాడింది అందుకే. అప్పుడామె చెప్పినవన్నీ ఇప్పుడు ఒకొక్కటిగా జరుగుతాయా?

నాలో అనుమానం, భయం, కలవరం. శ్యామ్‌కి చెప్పాలా కూడదా అన్న సందిగ్ధం. నేను వీటిలోంచి బయటపడేలోగానే అనర్థం జరిగిపోయింది. శ్యామ్ తండ్రి చనిపోయాడు.

నేను వణికిపోయాను. ఇక ఉపేక్షిస్తే లాభం లేదు. స్వప్న శ్యామ్ జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది. కానీ అందుకు నేనేం చేయాలి?

మా ఆఫీసునుంచి నేనుండే లీజ్‌ఫ్లాట్‌కి వెళ్లే దారిలో కుమారస్వామి ఇల్లు కమ్ అఫీసుంది. మంత్ర శక్తులతో ఎన్నో అద్భుతాలు సాధించిన మహానుభావుడాయన. ఆయన శిష్యులు అమెరికా, ఆస్ట్రేలియాల్లో బ్రాంచిలు తెరిచి మంత్ర శక్తుల ప్రాక్టీసు చేస్తున్నారని ఊళ్లో ఆయన గురించి గొప్పగా చెప్పుకుంటారు. తెలుగువాడు కాకపోతే ఈ పాటికి నేనూ ఆయన మీద కొంత ఆసక్తి చూపించి ఉండేవాణ్ణేమో!

ఇప్పుడు కూడా నమ్మకంతో కాక – ఏ పుట్టలో ఏ పాముంటుందో చూద్దామని నేనాయన దగ్గరకెడితే – వెంటనే అపాయింట్‌మెంట్ దొరికింది.

స్వామి ఆజానుబాహువు. ఖద్దరు ధారి. పచ్చని ఛాయ. చురుకైన కళ్లు. మనిషి విద్యాధికుడిలా హుందాగా ఉన్నాడే తప్ప మాంత్రిక లక్షణాలు లేవు. ఆయన నా సమస్య విని కొన్ని ప్రశ్నలువేసి మొత్తం కథంతా తెలుసుకుని, ''ఆధునికత అంటే – అన్నీ మనకి తెలుసుననుకోవడం కాదు. ఎన్నోమనకి తెలియవనుకోవడం. ఈ విషయాన్ని మనస్ఫూర్తిగా నమ్మితే నీ సమస్యకి పరిష్కారం చెబుతాను'' అన్నాడు.

''నాకు నమ్మాలనే ఉంది. కానీ నమ్మించడం మీ వంతు'' అన్నాను.

ఆయన నవ్వి, ''అమ్మ నిజమనీ, నాన్న నమ్మక మనీ నానుడి. అది నమ్మిన నువ్వు – నాన్నని నమ్మక పోతే – అదీ ఇంత వయసొచ్చాక – మీ అమ్మకి ఏమ నిపిస్తుంది?'' అన్నాడు.

అవకాశం వచ్చింది కదా అని హద్దులు మీరడం కుసంస్కారం. ఆయనకది పుష్కలంగా ఉందని బయట పడడంతో – నా ముఖం ఎర్రబడింది. వెళ్లిపోవాలని చటుక్కున లేచి నిలబడ్డాను.

''నా ప్రశ్నకి – నీకొచ్చినకంటే ఎక్కువ కోపమొస్తుంది అమ్మకి. నిజం తెలిసినవారికి, నిజాన్ని నమ్మని వారిపట్ల కోపం సహజం. నువ్వు దెయ్యాలు లేవంటే అక్కడే ఉండి ఆ మాట విన్న దెయ్యానికి కోపం రావడం కూడా అంతే సహజం. అందుకే అది రాత్రి పూట నీకు కనబడి తన ఉనికిని ఋజువు చేసుకుంది'' అన్నాడు కుమారస్వామి.

అమ్మ–నాన్న–నమ్మకం ప్రసక్తి తేవడానికి కుసంస్కారం కాని మరో ఉద్దేశ్యమేదో ఉందని అర్థమై – ఎలాలేచానో అలానే కూర్చుండిపోయాను. ఐతే ఆయన సంజాయిషీ కన్విన్సింగ్‌గా అనిపించక, ''నామీద కోపమైతే నా మిత్రుణ్ణి పెళ్లి చేసుకుని సాధించడమెందుకు?'' అన్నాను.

ఆయన మళ్లీ నవ్వాడు. ఆయన వివరణ ప్రకారం–

నేను దెయ్యాలు లేవన్నానని ఓ దెయ్యానికి కోపమొచ్చింది. ఒక రాత్రిపూట నాకు కనిపించి భయపెట్టింది. అంతటితో నన్ను వదిలే ఉద్దేశ్యం లేదు కాబట్టి – నాకు స్వప్న రూపంలో కనిపించింది. నిజానికి స్వప్న మామూలు మనిషే. స్వప్న నన్ను కలుసుకున్నప్పుడల్లా నాకు కనిపించిన దెయ్యం ఆమెను ఆవహించేది.

మనిషి భవిష్యత్తుని ఊహిస్తాడు. కానీ దెయ్యం దర్శించగలదు. తనకి తెలిసిన భవిష్యత్తుని నాకు ముందుగా చెప్పి నన్ను భయభ్రాంతులకి గురి చేయడం దెయ్యం ఉద్దేశ్యం. శ్యామ్ యాక్సిడెంటు, అతడి తండ్రి మరణం - రాసిపెట్టినవే తప్ప దెయ్యం సృష్టించినవి కావు.

భవిష్యత్తులో జరిగే అనర్థాలు ముందుగా తెలిస్తే మనిషికి మనశ్శాంతి ఉండదు. దెయ్యం తన ఉనికిని చాటుకోవడమే కాక నాకు మనశ్శాంతి లేకుండా చేసి తన కోపం తీర్చుకుంటోంది.

''నువ్వు దెయ్యోపహతుడివి. ఈ సమస్య నుంచి బయట పడకపోతే - ఆ దెయ్యం నీకు జీవితాంతం మనశ్శాంతి లేకుండా చేస్తుంది'' అన్నాడు కుమారస్వామి.

ఆయన చెప్పింది నమ్మశక్యంగా లేకపోయినా, నమ్మడం వల్ల కొంత మనశ్శాంతి లభిస్తుందనిపించింది. అందుకని తరుణోపాయం చెప్పమని కోరాను.

అప్పుడాయన నా కుడిచేతి ఉంగరం వేలుకి ఓ రాగి ఉంగరం తొడిగాడు. కొద్ది నిముషాలు కళ్లు మూసుకుని ధ్యానంలో ఉన్నాడు. కళ్లు తెరిచాక, ''ఇప్పుడోసారి ఉంగరాన్ని శ్రద్ధగా చూడు'' అన్నాడు.

చూసి ఉలిక్కిపడ్డాను. ఉంగరానికి మధ్య పలక మీద ఓ అమ్మాయి ఫొటో. అది స్వప్నది.

''ఆ రోజు నుంచీ నీతో తిరుగుతున్న దెయ్యం ఇప్పుడీ ఉంగరంలో కొచ్చింది. ఏ స్త్రీ రూపంలో ఆ దెయ్యం నీకు కనిపిస్తోందో - ఆ స్త్రీ భర్త ధరిస్తానంటేనే ఈ ఉంగరం నీ వేలి నుంచి ఊడొస్తుంది. కొద్ది రోజుల్లో శ్యామ్ తల్లి మంచం పడుతుంది. అతడికి గ్రహ యోగం బాగోలేదని నమ్మించి ఈ ఉంగరం అతడిచే ధరింపజేయి. నీకు మనశ్శాంతి లభిస్తుంది'' అన్నాడు స్వామి.

ఉంగరం పలకమీద స్వప్న ఫొటో చూడగానే నాకు కుమారస్వామి మీద నమ్మకమూ, గౌరవమూ ఒక్కసారి కలిగాయి. నేనాయనకు నమస్కరించి, ''మరి శ్యామ్‌కి మనశ్శాంతి ఉంటుందా?'' అనడిగాను.

''ఉంగరం ధరించి పల్లెలో వీధరుగుమీద పడుకోనంతకాలం అతడి మనశ్శాంతికి ఏ లోటు ఉండదు. ఐతే ఆ విషయాన్నితడి అదృష్టానికి వదిలిపెట్టాలే తప్ప నువ్వు హెచ్చరించకూడదు సుమా!'' అని హెచ్చరించాడు స్వామి.

''శ్యామ్‌కంత ధైర్యం లేదని నాకు నమ్మకమే కానీ - ఒక వేళ అలా పడుకుంటే ఏమౌతుంది?''

''తన భార్య ఓ దెయ్యమన్న అనుమానమొచ్చిన భర్త మనఃశ్శాంతి గురించి ఒకరు చెప్పాలా?'' అని నవ్వి, ''ఎండగా ఉందని నీడకోసం తాటి చెట్టుకిందకి వెడితే - అప్పుడే దాని పండొకటి రాలి నెత్తిమీద పడిందిట. అది దైవోపహతుడి కథ. దెయ్యోపహతుడి గతి దీనికేం తీసిపోదు. అందులోనూ ఈ దెయ్యం మహా తెలివైనది. శ్యామ్‌లో ఇదివరకెన్నడూ లేని ధైర్యం పుట్టించగలదు. ఐనా మనం చేసేది మానవ ప్రయత్నం. బుద్ధిః కర్మానుసారిణీ'' అన్నాడు కుమారస్వామి.

***

శ్యామ్ తల్లి మంచమెక్కిందని తెలిసేక ఓదార్పుకి వెళ్లాను. వాడి బలహీనతని కనిపెట్టి - రాగి ఉంగరాన్ని వాడిచేత ధరింపజేసాను. వాడి భార్య ఫొటోతో ప్రత్యేకంగా చేయించానంటే నమ్మేసిన వాడు నాకు పదేపదే థాంక్స్ కూడా చెప్పాడు.

ఆశ్చర్యమేమిటంటే ఆ తర్వాత వాడి తల్లికి నయమై పూర్తిగా మామూలు మనిషైంది. వాడు నాకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పి, ''మంచి మనసుతో నువ్వు నాకిచ్చిన ఈ ఉంగరం మీద నాకు పూర్తి నమ్మకం కలిగింది. నాకిప్పుడు పూర్వపు భయాలన్నీ పోయాయి. నా ధైర్యం ఏ లెవెల్ చేరిందంటే - ఒక రాత్రి మా ఇంటి వీధరుగు మీద ఒక్కణ్ణీ పడుకోవాలనుంది'' అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. అంత పని మాత్రం చేయకు - అన్నమాట నాలిక చివరిదాకా వచ్చినా - అలా హెచ్చరించడం నాకు నిషిద్ధమన్న కుమారస్వామి హెచ్చరిక గుర్తుకొచ్చింది. ఒకప్పుడైతే ఏమోకానీ ఇప్పుడు నాకాయన మాట శిలాశాసనం

***

పెద్దలు నాకు రాగిణితో సంబంధం నిశ్చయించారు. పెళ్లి విశాఖపట్నంలో.

పెళ్లికి శ్యామ్ దంపతులు వచ్చారు. స్వప్న నాతో ఎంతో కలుపుగోలుగా హుషారుగా మసలుతుంటే - శ్యామ్ మాత్రం ఏదో పోగొట్టుకున్న వాడిలా అదోలా కనిపించాడు. అదేమని అడిగితే స్వప్న తనే కలగజేసుకుని, ''కాకినాడ వెడదామండీ అంటే వినకుండా సూరత్ నుంచొస్తూనే స్వంత ఊళ్లో దిగాలన్నారు. అక్కడేమో వద్దన్నా వినకుండా ఓ రాత్రంతా ఇంటి వీధరుగు మీద పడుకున్నారు. ఏమైందో ఏమిటో - అప్పట్నించీ ఇలా ఉన్నారు'' అంది.

ఉలిక్కిపడ్డాను. అనుకున్నంతా అయింది.

''తన భార్య ఓ దెయ్యమన్న అనుమానమొచ్చిన భర్త మనఃశ్శాంతి గురించి ఒకరు చెప్పాలా?'' అన్న కుమారస్వామి మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

స్వప్న హుషారుకి కూడా అదే కారణమేమో! అప్పట్లో నన్ను భయపెట్టినట్లు ఇప్పుడు భర్తనే భయపెట్టి వినోదిస్తూంటుంది. పైగా నంగనాచిలా ఏమీ తెలియనట్లు ఆశ్చర్య మొకటి!

శ్యామ్ ఆమెతో ఏమవస్థపడుతున్నాడో ఏమో కానీ - ఇప్పుడు స్వప్న నా జోలికి రావడం లేదు. ఆమెతో మాట్లాడుతుంటే మామూలు మనుషులతో మాట్లాడినట్లే ఆహ్లాదంగా ఉంది.

పెళ్లి హడావుడిలో నేను శ్యామ్‌ని అంతగా పట్టించుకోలేదు. కానీ వాడు మా హనీమూన్ ట్రిప్పుకి ముందు రోజు సెలవు తీసుకోబోతూ రాగిణితో ఏకాంతంగా మాట్లాడతానంటే చరిత్ర పునరావృతమౌతాందా అని ఉలిక్కి పడ్డాను.

అక్కడ వాడామెకి ఏం చెబుతాడోనని నాలో టెన్షన్!

ఆ రాత్రి రాగిణిని అడిగితే మాట దాటేయాలని చూసింది. నొక్కించగా నొక్కించగా, ''మీరు నొచ్చుకుంటారని చెప్పలేదు. ఇక చెప్పకతప్పదు. మీ ఫ్రెండు మంచివాడు కాదు'' అంది.

ఊహించని ఈ అభియోగానికి తెల్లబోయి, ''నువ్వెక్కడో పొరపాటుపడ్డావు. వాడు కాలేజీరోజుల్నించీ నా ప్రాణస్నేహితుడు'' అన్నాను.

''ఐతే తన వేలి ఉంగరం మీద మీ ఫొటో ఉండాలి కానీ - నా ఫొటో ఎందుకున్నట్లు?'' గద్దించింది రాగిణి.

''ఏమన్నావ్?'' అన్నాను. ఆ తర్వాత నోట మాట రాలేదు.

''అది చూసి మందలించాలని నేనే ఆయనతో ఏకాంతంలో మాట్లాడాలనుకున్నాను. అలా చెబితే బాగుండదని తనే నన్నడిగినట్లు చెప్పమన్నాను. ఏం చెబుతానని లొట్టలేసుకుంటూ వచ్చాడు. దుమ్ము దులిపి పంపాను'' కోపంగా అంటోంది రాగిణి.

అప్పుడు నాకు శ్యామ్ ఊళ్లో వేపచెట్టు గుర్తొచ్చింది. దానికి తలకిందులుగా వేలాడుతూ రాగిణి. ఆ రాగిణిని చూసిన శ్యామ్.

''తన భార్య ఓ దెయ్యమన్న అనుమానమొచ్చిన భర్త మనఃశ్శాంతి గురించి ఒకరు చెప్పాలా?'' అన్న కుమారస్వామి మాటలు ఎవరినుద్దేశించి అన్నవో అప్పుడర్థమైంది.

అంతే - రాగిణి శ్యామ్‌తో నా భవిష్యత్తు గురించి ఏం చెప్పిందోనన్న కలవరం నాలో మొదలైంది.

✻

రచయిత సెల్ నెం. 040-27144697



## నయనతార ఔట్?

నయనతార ఔట్ అయింది సినిమా రంగం నుంచి కాదు. 'సింహా' వాల్‌పోస్టర్ల నుంచి. 'సింహా' పబ్లిసిటీలో భాగంగా వాల్‌పోస్టర్లను విపరీతంగా విడుదల చేశారు. అయితే ఈ పోస్టర్లలో చాలా వరకూ ఎక్కడా నయనతార స్టిల్ లేకుండా నిర్మాత జాగ్రత్తపడ్డాడని అంటున్నారు. ఈ విషయంలో దర్శకుడు ఎంత పట్టుపట్టినా లాభ లేకపోయిందని చెబుతున్నారు. పోస్టర్లలో ఎక్కువగా నమిత, స్నేహాఉల్లాల్ ఉన్న స్టిల్స్‌నే ఉపయోగించారు. దీన్ని బట్టి 'సింహా' పబ్లిసిటీ నుంచి నయనతారను పక్కకి తప్పించారని అర్థమవుతోందని టాలీవుడ్‌లో పలువురు అంటున్నారు. ఇది కేవలం పబ్లిసిటీ వరకేనా, ఏకంగా సినిమాల నుంచి కూడానా అన్నది వారి అనుమానం.